క్లుప్తంగా

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



నెమ్మలూరు(పామర్రు): మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని నెమ్మలూరు శివారు మలయప్పన్న పేటలో వైఎస్సార్ సీపీ నాయకుడు దాసి దీనకుమార్ భార్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మృతురాలి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రుడి వితరణ

పమిడిముక్కల: పెనుమత్స గ్రామానికి చెందిన దండమూడి కృష్ణారావు కుమారుడు డాక్టర్ దండమూడి బాబు రాజేంద్రప్రసాద్ వాటర్ ట్యాంకుకు మోటార్ కొనుగోలు నిమిత్తం రూ.56,000 సాయం అందజేశారు. మోటార్ రిపేర్ వస్తే ఎస్సీ కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామస్తులు రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కొత్త మోటార్ కొనుగోలుకు ఆర్థిక సాయం అందజేశారు. రాజేంద్రప్రసాద్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటర్ల తుది జాబితా విడుదల



గుడివాడ టౌన్: గుడివాడ నియోజకవర్గ తుది ఓటర్ల జాబితా ఆర్డీఓ పి.పద్మావతి సోమవారం విడుదల చేశారు. అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్ల జాబితాను ఓటర్లకు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గంలో మొత్తం 2,00,786 నమోదైనట్లు తెలిపారు. ఇందులో పురుషులు 96,342 మంది, మహిళలు 1,04,434, ఇతరులు 10 మంది ఓటర్లుగా నమోదైనట్లు పేర్కొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ముదినేపల్లి రూరల్: మండలంలోని బొమ్మినంపాడులో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. స్కీం సూపర్‌వైజర్ బి.రాకేష్ మాట్లాడుతూ హెచ్ఐవీ సోకిన వారు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా మందులు వాడుతూ జీవితకాలాన్ని పెంచుకోవచ్చన్నారు. లింక్ వర్కర్ ఆర్.సత్యవతి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఏఎన్ఎం జి.జ్ఞానేశ్వరి, ఆశా వర్కర్ విజయకుమారి పాల్గొన్నారు.

కొల్లేరు గ్రామాలను ముంపు నుంచి రక్షించాలి

మండవల్లి: కొల్లేరు లంక గ్రామాలకు ప్రతి ఏటా వచ్చే వరద ముంపు నుంచి రక్షించాలని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కర రావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ కె.రాజ్‌కుమార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని పలు లంక గ్రామాలు ప్రతి ఏటా వర్షాకాలంలో ముంపునకు గురై ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కాలువలను తవ్వి, అభయారణ్యాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గుడివాడ టౌన్: గాయత్రి మహిళా సంక్షేమ సంఘం గుడివాడ వారి ఆధ్వర్యంలో మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం కార్యదర్శి వై చంద్రకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మందిరంలో ఈ వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరంలో కార్డియాలజీ, సీజనల్ డిసీజెస్, కంటి వైద్యులు, దంత వైద్య నిపుణులు, క్యాన్సర్ వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

గిడుగు రామమూర్తికి ఘన నివాళి



ముదినేపల్లి రూరల్: తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని పెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించారు. హెచ్ఎం బేతాల రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గిడుగు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు సీహెచ్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా

- డ్వాక్రా మహిళలకు రుణమాఫీ
- నేడు నాలుగో విడత నిధులు జమ చేయనున్న ప్రభుత్వం
- కలిదిండి మండలంలో రూ.13.94 కోట్ల మాఫీ



మూడో విడతలో డ్వాక్రా మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ (ఫైల్)

కలిదిండి: స్వయం సహాయక సంఘాల మహిళలు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టారు. గత ఎన్నికల తేదీ నాటికి పొదుపు సంఘాలకు ఉన్న రుణాలను మాఫీ చేస్తానని ప్రకటించారు. సభ్యులు తీసుకున్న రుణాలను నాలుగు విడతల్లో చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డాక్రా మహిళల రుణాల మాఫీకి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే మూడు విడతల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ నెల 23న నాలుగో విడత రూ.13.94 కోట్లు మండలంలోని సంఘాలకు జమ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో గ్రామాల్లో ఆసరా వారోత్సవాలు నిర్వహించనున్నారు. తమ రుణాలను చెల్లించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఈ పథకం ఎంతో మేలు చేస్తోందని డ్వాక్రా మహిళలు చెబుతున్నారు. తమ కుటుంబ ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా సాయమందిస్తున్న సీఎం జగన్‌కు మహిళలు కతజ్ఞతలు తెలియజేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా పథకం స్వయం సహాయక బృందాల ఉత్పాదకతను మెరుగుపరచడంతో పాటు గత ప్రభుత్వ హయాంలో బ్యాంకుల్లో బకాయి ఉన్న రుణాలను తిరిగి చెల్లించేందుకు దోహద పడుతోంది. పథకంలో భాగంగా పట్టణ, గ్రామీణ స్వయం సహాయక బృందాల మహిళలకు 2019 ఎన్నికల నాటికి బ్యాంకుల్లో ఉన్న రుణాలను ప్రభుత్వం నాలుగు విడతలుగా చెల్లిస్తోంది. వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా మండలంలోని అన్ని సంఘాలకు చెందిన సభ్యుల ఖాతాల్లో ఆసరా నిధులను నేరుగా జమ చేస్తున్నారు.

కలిదిండి మండలంలోని వైఎస్సార్ ఆసరా పథకం వివరాలు

	డ్వాక్రా సంఘాలు	సభ్యులు	రూ.కోట్లలో
మొదటి విడత	1,444	15,884	13.91
రెండో విడత	1,450	15,950	14.02
మూడో విడత	1,450	15,950	14.02
నాలుగో విడత	1,447	15,917	13.94

మండలంలోని పొదుపు సంఘాల వివరాలు

గ్రామాలు :	23
గ్రామైక్య సంఘాలు :	44
మొత్తం పొదుపు గ్రూపులు:	1,692
మొత్తం సభ్యుల సంఖ్య :	19,955

జీవనోపాధి పెంచేలా..

రుణ బకాయిలు మాఫీ చేయడం ద్వారా డ్వాక్రా మహిళలకు ఆర్థిక ఉపశమనంతో పాటు వ్యాపారాల అభివృద్ధికి మద్దతు లభిస్తోంది. మహిళల జీవనోపాధి మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని దిగ్విజయంగా అమలు చేస్తోంది.

మహిళలకు ఎంతో మేలు



వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా స్వయం సహాయక సభ్యులకు ఎంతో మేలు జరిగింది. ఇప్పటికే మూడు విడతల రుణమాఫీ సొమ్ము చెల్లించాం. ఈ నెల 23వ తేదీన నాలుగో విడత సొమ్ము బ్యాంకుల్లో జమ చేయనున్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం లబ్ధిదారుల ఎంపిక జరిగింది. గ్రూపుల్లోని సభ్యులు ఆర్థికంగా ఎదగడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతోంది.

– సీహెచ్ రవికుమార్, ఏపీఎం ఇన్‌చార్జి, కలిదిండి మండలం

ఆర్థికంగా భరోసా



గత ఎన్నికల సమయానికి మా గ్రూపు సభ్యులకు బ్యాంకులో అధిక సంఖ్యలో అప్పు ఉండేది. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు విడతల్లో పూర్తి రుణమాఫీ చేయడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం మా అప్పు తీర్చడంతో ఆర్థికంగా భరోసా కలిగింది. వైఎస్సార్ ఆసరా పథకంతో మాలాంటి వాళ్లకు ఎంతో మేలు జరిగింది.

– తులసి, రామసిత గ్రూపు, భాస్కరరావుపేట

మొవ్వ ఐసీడీఎస్ పరిధిలో 16 మంది హాజరు

మొవ్వ: మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల నుంచి ఉదయం 10 గంటలలోపు 16 మంది విధులకు హాజరవుతూ తమ అంగీకార పత్రాలను తమ కార్యాలయంలో అందించినట్లు సీడీపీఓ పి.భానుమతి తెలిపారు. నిరవధిక సమ్మెకు దిగిన అంగన్వాడీ సిబ్బంది సోమవారం ఉదయం 10 గంటలలోపు విధులకు హాజరు కావాలంటూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ప్రాజెక్టు పరిధిలోని ఘంటసాల మండలం నుంచి 12 మంది, చల్లపల్లి మండలం నుంచి నలుగురు అంగీకార పత్రాలను అందజేసినట్లు పేర్కొన్నారు.

కైకలూరు: ప్రభుత్వం తమ సమస్యలకు సానుకూలంగా స్పందిస్తుందన్న నమ్మకంతో ఆందోళన బాటపట్టిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తిరిగి విధుల్లో చేరుతున్నారు. కైకలూరు నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో కలిపి మొత్తం 310 మంది కార్యకర్తలు, ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. ఆందోళన విడిచి సోమవారం ఉదయం 10 గంటలకు విధుల్లో చేరాలని వీరికి ప్రభుత్వం షరతు విధించింది. దీంతో నాలుగు మండలాలకు చెందిన 16 మంది అంగన్వాడీ టీచర్లు, మరో 18 మంది ఆయాలు కైకలూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీడీపీఓ బి.ఆనంద్ సమక్షంలో సోమవారం విధుల్లో చేరారు. మధ్యాహ్నం 12 గంటల వరకు విధుల్లో చేరడానికి సమయం పెంచారు. మధ్యాహ్నం తర్వాత మరో 20 మంది వచ్చినప్పటికీ సమయం లేకపోవడంతో వెనుతిరిగారు. మంగళవారం అంగన్వాడీల సమస్యలకు ప్రభుత్వం నుంచి పరిష్కారం లభిస్తుందని పలువురు కార్యకర్తలు భావిస్తున్నారు.

మార్మోగిన శ్రీరామ నామ స్మరణ



పామర్రులోని విష్ణాలయంలో శ్రీవేణుగోపాల భజన సమాజ సభ్యుల చెక్క భజన

జమీదగ్గుమిల్లి(పామర్రు): అయోధ్యలో శ్రీరాముడి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని జమీదగ్గుమిల్లిలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజ, భజన కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామం అంతా శ్రీరామ నామ స్మరణతో మార్మోగింది. తొలుత ఆలయంలో స్వామికి అర్చన శత సహస్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రొంపిచర్ల ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు సీతారామాంజనేయదాసు, శ్రీనివాసరావు, అచ్యుతరావు, చెన్నారాయుడు, నాని, గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

రమణీయంగా శోభాయాత్ర

పెదముత్తేవి(మొవ్వ): అయోధ్యలో నిర్వహించిన బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మొవ్వ మండలం పెదముత్తేవి, కూచిపూడి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన శోభాయాత్ర రమణీయంగా సాగింది. కూచిపూడి అగ్రహారంలో యువకులు పంచలోహ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించి, శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నారాయణపురంలో..

పమిడిముక్కల: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కృష్ణాపురం సచివాలయం పరిధిలోని నారాయణపురంలో సోమవారం అన్నసంతర్పణ చేశారు. శ్రీరాముడి జెండాలు, అక్షతలు భక్తులకు అందజేశారు. గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్, పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ మహేష్, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ రాంబాబు, చలమయ్య, కంచర్ల గజాల, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

శ్రీహరిపురంలో..

ముదినేపల్లి రూరల్: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని శ్రీహరిపురం, సింగరాయపాలెం గ్రామాల్లో సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. శ్రీహరిపురం రామాలయం నుంచి సింగరాయపాలెం బావాజీ మఠం వరకు మేళతాళాలు, మంగళవాయిద్యాలు భక్తుల శ్రీరాముని నినాదాల మధ్య శోభాయాత్ర కనుల పండువగా జరిగింది. అనంతరం బావాజీమఠంలోని కోదండ రామాలయంలో ప్రముఖ యాజ్ఞకులు ఆసూరి రంగనాథాచార్యులు(చిన్నారి స్వామి) ఆధ్వర్యంలో స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముదినేపల్లిలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి శ్రీరామభక్తులు సెంటర్లో బైక్ ర్యాలీ నిర్వహించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: అయోధ్య శ్రీ రామ మందిర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో సనాతన ధర్మ నాదోపాసకులు, బృందాల సమైఖ్య సభ ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవ మహాసభ నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవలు, మహాభిషేకం, కల్యాణం, హనుమాన్ చాలీసా తదితర కార్యక్రమాలతో పాటు 108 మంది దంపతులతో సామూహిక కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండలి హనుమంతరావు, బూరగడ్డ శ్రీనాధ్, చందరాల హరిరాంబాబు, చలమలచర్ల మురళీ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.



కొతవరం సాయి మందిరంలో శ్రీరాముడికి పూజలు

కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో..

స్థానిక వాసవి చౌక్ లోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీ రామమందిర విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని విజయదుర్గ భజన, కోలాటం బృందం సభ్యులు సోమవారం హనుమాన్ చాలీసా, కోలాటం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, సముద్రాల వెంకట జగ్గారావు, ఐదా గోపాలకృష్ణ పాల్గొన్నారు.

గీతా మందిరంలో...

స్థానిక కాకర్ల వీధిలోని గీతామందిర నిర్వాహకుల ఆధ్వర్యంలో అయోధ్య రామమందిర విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని స్వామి వారి నగర సంకీర్తన, 108 మంది దంపతులచే శ్రీ రాముల వారి కల్యాణం, శ్రీ సరస్వతి శ్రీ హరివితల కోలాట భజన మండలి ఆధ్వర్యంలో సోమవారం కోలాటం నిర్వహించారు. కృష్ణ, ఇ.వెంకటకృష్ణ, ఎస్.వెంకటకృష్ణ, జి.సుబ్బారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలో వాడవాడలా శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. సోమవారం అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని కొతవరం, గుడ్లవల్లేరు, వడ్లమన్నాడు, సింగలూరులోని ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. కొతవరం పెద దళితవాడలోని రామాలయంలో చిరంజీవమ్మ ప్రొడక్షన్స్ అధినేత, సినీ నిర్మాత చల్లపల్లి అమర్‌ప్రసాద్ స్వామివారికి ప్రత్యేక పూజలను చేయించారు. గ్రామంలోనే శ్రీ షిరిడీ సాయి మందిర అభివృద్ధి చైర్మన్ కానూరి బాలకృష్ణమోహన్ అన్న ప్రసాదాలను భక్తులకు అందజేశారు. కేడీసీసీ జిల్లా డైరెక్టర్ పడమటి సుజాత ఆ మందిర మహిళా నిర్వాహకులు బొబ్బా ఝాన్సీలక్ష్మీ, వడ్లమూడి పద్మజ, వడ్లమూడి సీతారావమ్మ, తూము ప్రమీలారాణి, బొబ్బా రంగనాయకమ్మ, క్లోపల్లి సుధారాణి పాల్గొన్నారు. గుడ్లవల్లేరు పాల శీతల కేంద్రంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ శ్యామ్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి శ్రీరాముని జెండాను ఎగురవేశారు.



శ్రీహరిపురంలో జరిగిన శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



జమీదగ్గుమిల్లి ఆలయంలో భజన కార్యక్రమం

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని రామాలయాలు భక్తులతో కళకళలాడాయి. శ్రీవాసవీ ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం జరిగింది. ఆలయ అర్చకుడు అగ్నిహోత్రం విప్రనారాయణ ఆధ్వర్యంలో తాడికొండ ఉదయ సూర్య సుధాకరరావు, రమా దంపతులు స్వామికి కల్యాణం జరిపించారు.

భారీ ర్యాలీ

పామర్రు: జై శ్రీరామ్ అంటూ పామర్రు గ్రామంలో ఆర్యవైశ్య యువజన సంఘ సభ్యులు అందరూ కలిసి సోమవారం బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో అయోధ్యలోని శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని పూజలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం సాయింత్రం యువజన సంఘ సభ్యులు అందరూ భారీగా బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక విష్ణాలయంలో శ్రీవేణుగోపాల భజన సమాజ సభ్యులు రాముల వారి చెక్క భజన కార్యక్రమం నిర్వహించారు. గురువులు కొల్లి సత్యనారాయణరెడ్డి, మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులు చెక్కభజన చేస్తూ రాముల వారి భక్తి పాటలను ఆలపించారు. జమీదగ్గుమిల్లిలోని రామాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కలిదిండిలో..

కలిదిండి: అయోధ్యలో శ్రీరాముడు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం సానా రుద్రవరం, కొండగి తాడినాడ, పెద్దలంక, కోరుకొల్లు, గుర్వాయపాలెం, కలిదిండి ఆలయాల్లో, ప్రతి ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓటర్ల జాబితాను పరిశీలించండి

ఆర్డీఓ పద్మావతి

గుడివాడ టౌన్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆర్డీఓ పి.పద్మావతి కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అన్ని పార్టీల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గుర్తింపు పొందిన పార్టీలకు ఈ ఓటర్ల జాబితా అందజేస్తున్నామన్నారు. మీ పార్టీల కార్యకర్తలతో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆమె కోరారు. జాబితాలో ఎవరైనా మృతి చెందిన వారి పేర్లు గుర్తించినట్లయితే వాటిని తమ జాబితాలో రెడ్ మార్క్ చేస్తామని పేర్కొన్నారు. వీటికి సంబంధించి పూర్తి ఆధారాలను అందజేయాలని కోరారు. ఇక కొత్త ఓటర్లు చేరి ఉంటే అనుబంధ జాబితా విడుదల చేస్తామని తెలిపారు. రాజకీయ పార్టీలు ఈ విషయంలో ఎన్నికల అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ ప్రతినిధులు కె.ఆంజనేయప్రసాదు, ఎం.రమేష్, అంగడాల సతీష్, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ పద్మావతి

సంక్షిప్త వార్తలు

■ అక్కినేనికి ఘన నివాళులు



అక్కినేని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పొట్లూరి శ్రీమన్నారాయణ

గుడివాడ టౌన్: ప్రముఖ సినీ నటుడు దాదా సాహెబ్ పాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వర రావు 10వ వర్ధంతి సోమవారం స్థానిక విశ్వభారతి హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించారు. విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అక్కినేని నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ ప్రాంతం వానిగా ప్రపంచ దేశాలలో తెలుగువారి జ్ఞాపకాల్లో నిలిచిపోయిన గొప్ప నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని శ్రీమన్నారాయణ అన్నారు.

■ ఇరు వర్గాలపై కేసుల నమోదు

తోట్లవల్లూరు: డబ్బుల విషయమై జరిగిన దాడి ఘటనలో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు తోట్లవల్లూరు ఎస్ఐ పి. విశ్వనాథ్ తెలిపారు. మండలంలోని యాకమూరుకు చెందిన గూడపాటి సురేష్, సరిహద్దు భువన చంద్రిక కుటుంబాల మధ్య ఈ నెల 19 రాత్రి డబ్బుల బాకీ విషయమై గొడవ జరిగింది. ఈ గొడవలో సురేష్ కుమారుడు సోమశేఖర్‌కు, భువన చంద్రికకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

■ 18 ఆలయాలకు పూజాధికాల పంపిణీ



పామర్రు: అయోధ్యలో రామయ్య విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా పామర్రు మండలంలోని ఆదాయం లేని 18 శ్రీరాముల వారి ఆలయాలకు సోమవారం పూజాధికాలను నిర్వహించేందుకు విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు అందజేశారు. ఒక్కొక్క ఆలయానికి సుమారు రూ.వెయ్యి విలువల గల పూజా సామగ్రిని విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి, కొండిపర్రు సిద్ధాంతి ఆరేపల్లి నాగరాజు స్వయంగా ఆలయాలకు అందజేశారు. ప్రతి ఆలయానికి పూల దండలు, పూజా సామగ్రి, ప్రసాదం వస్తువులను అందించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు పీఎంఎస్ ప్రసాద్, నిఖిల్, అశోక్ , శ్రీదేవి, తేజ, పవన్‌కుమార్ పాల్గొన్నారు. కొండిపర్రు రోడ్డు పక్కన ఉన్న వీరాంజనేయపురంలోని కలౌ కపి చండి వినాయక క్షేత్రం ప్రాంగణంలో గణపతి లక్ష్మీ సరస్వతి దేవాలయం వద్ద భక్తులకు మహా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

■ ఉజ్వల యోజన వినియోగించుకోవాలి

మండవల్లి: ఉజ్వల యోజన పథకం మహిళలకు సక్రమంగా అందజేయడానికి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకట రామ్‌ప్రసాద్ సోమవారం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. స్థానిక శ్యామలాంబ గ్యాస్ ఏజెన్సీ ద్వారా లబ్ధిదారులకు పథకం చేరేలా తగు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

■ హిందూ ధర్మ సమితి ఆధ్వర్యంలో పూజలు



మండవల్లి: అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని మండవల్లిలో హిందూ ధర్మ సమితి ఆధ్వర్యంలో స్థానిక కైకలూరు వీధిలో సోమవారం ఉదయం ఏడు నుంచి రాత్రి ఏడు గంటలకు శ్రీరామునికి ప్రేమపాత్రమైన హరే రామ భజన కార్యక్రమం జరిగింది. మండవల్లి నుంచి లోకుమూడి సెంటర్, ముదినేపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

ప్రతి పేదవాడికి సొంత ఇల్లు

గుడివాడ టౌన్(నందివాడ): ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం అని వైఎస్సార్ సీపీ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. సోమవారం నందివాడ మండలం ఇలపర్రు గ్రామానికి చెందిన ఏడుగురు లబ్ధిదారులకు ఇళ్లస్థలం పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల ఆదాం, తహసీల్దార్ భవన్నారాయణ, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఆర్ఐ గణేష్, ఈఓపీఆర్డీ జి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తోట నాగరాజు, కందుల నాగరాజు, కృష్ణారెడ్డి, నాగూర్‌బాబు పాల్గొన్నారు.



పట్టాలు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పేదల కోసం జన ఔషధి

చల్లపల్లి: పేదలు, రైతులు, వ్యవసాయ కార్మికులకు తక్కువ ధరకే మందులు అందించడానికి జన ఔషధి కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి) తెలిపారు. స్థానిక పీఏసీఎస్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న జన ఔషధి కేంద్రం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫణి మాట్లాడుతూ ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం, ఫార్మాస్యూటికల్ మెడికల్ డివైజెస్ బ్యూరో ఆఫ్ ఇండియా చేపట్టిన కార్యక్రమం ద్వారా పీఏసీఎస్‌లో నూతన జనరిక్ మందుల దుకాణం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో 1,759 రకాల మందులు, 280 రకాల సర్జికల్ పరికరాలు 50 నుంచి 90 శాతం రాయితీపై లభిస్తాయని తెలిపారు. జిల్లాలో ఈ తరహా కేంద్రాలు ఐదు మంజూరైనట్లు తెలిపారు.

పండ్లు పంపిణీ

గుడివాడ టౌన్: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని శ్రీ ద్వారకా సాయి సంస్థ గుడివాడ వారి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సమీపంలో బాటసారులకు సోమవారం పండ్లు పంపిణీ చేశారు. సుమారు ఐదు వేలుకు పైబడి పండ్లను బాటసారులకు పంపిణీ చేసినట్లు సంస్థ అధ్యక్షుడు సీతారామస్వామి తెలిపారు. శ్రీనివాసరావు, నారాయణమూర్తి, లక్ష్మి పాల్గొన్నారు.